RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 33 | జనవరి 07, 2026 | వెల : రూ.3-00




**సామాజిక తెలంగాణ కోసం కలిసి నడుద్దాం**

3లో..

# మొక్కుబడి.. రోడ్ సేఫ్టీ..!!

- ☐ డబ్బు వృథా ఈవెంట్లుగా 'రోడ్డు భద్రత వారోత్సవాలు'
- ☐ వేదికలపై భద్రత.. రోడ్లపై మృత్యు గోతులు
- ☐ లక్షలు ఖర్చు.. ఫలితం శూన్యం
- ☐ ముగ్గులు, ఫ్లెక్సీల ప్రచారంతో ప్రమాదాలు ఆగేనా?
- ☐ రోడ్లపై గుంతల బాధ్యత ఎవరిది?
- ☐ సైన్ బోర్డులు లేవు.. స్పీడ్ బ్రేకర్లు ఉండవు
- ☐ సెల్ ఫోన్ డ్రైవింగ్‌పై కనిపించని కాఠిన్యత
- ☐ మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ పట్టదా?
- ☐ 'టార్గెట్ల' కోసమే మొక్కుబడి చలాన్లు
- ☐ పౌరులుగా మనమూ రోడ్డు భద్రత అందరి బాధ్యత

3లో..




**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

రాష్ట్రంలో రోడ్డు భద్రతా వారోత్సవాలు వచ్చాయంటే చాలు.. అధికారుల హడావుడి చూసి జనం నవ్వుకోవాలో, ఏడవాలో అర్థం కాని పరిస్థితి. ఏటా లక్ష్యం.. మార్పు.. భద్రత అంటూ వేదికల మీద ఊదరగొట్టే ఉపన్యాసాలు.., రోడ్లపై వేసే రంగు రంగుల ముగ్గులు.., గాలిలోకి వదిలే బెలూన్లు.. ఇవేనా రోడ్డు భద్రత అంటే? అని సామాన్య వాహనదారుడు ప్రశ్నిస్తున్నాడు. రోడ్లపై అడుగు తీసి అడుగు వేయలేని విధంగా మృత్యు గుంతలు దర్శనమిస్తుంటే.. ఇది ఏ రకమైన భద్రత? కోట్లాది రూపాయల బడ్జెట్‌ను కేవలం టీలు, టిఫిన్లు, హోర్డింగ్‌లు, సోషల్ మీడియా కలరింగ్‌కి తగలేస్తూ, మొక్కుబడి ప్రచారంతో కాలక్షేపం చేస్తున్న అధికారులకు ప్రాణం విలువ తెలియడం లేదా? పోలీస్ శాఖ జరిమానాల వేటలో ఉన్న శ్రద్ధ.. వాహనదారుడి ప్రాణం కాపాడటంలో ఎందుకు చూపడం లేదు? ఆర్అండ్ బి శాఖకు రోడ్ల మీద గుంతలు పూడ్చే తీరిక లేదు..

# 'భూ భారతి' దేశానికే ఆదర్శం

- రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు
- ర్వే విభాగం బలోపేతానికి వేలాది సర్వేయర్ల నియామకం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ట్రెస్సా 2026 డైరీ ఆవిష్కరణ



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టి, గ్రామస్థాయి వరకు వ్యవస్థను బలోపేతం చేశామని..గత రెండేళ్లలో అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నామని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హైదరాబాదు నాంపల్లిలోని ట్రెస్సా కార్యాలయంలో తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ 2026 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పొంగులేటి ముఖ్య మిగతా 4వ పేజీలో..

# కాంగ్రెస్ పాలనకు దిక్కూ దిశా లేదు

- సీఎంకు నీళ్ల మీద కూడా అవగాహన లేదు
- రెండేళ్లయినా హామీల అమలు శూన్యం
- రైతులు యూరియా కోసం చలిలో లైన్లలో నిలబడుతున్నారు
- కేసీఆర్‌పై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**వేద న్యూస్, జనగామ:**

కాంగ్రెస్ పాలనకు దిక్కూ దిశా లేదని, ముఖ్యమంత్రికి పాలనపై అవగాహన కూడా లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జనగామ పట్టణంలోని భ్రమరాంబ కన్వెన్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల అభినందన కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని పాలన పూర్తిగా విఫలమైందని వ్యాఖ్యానించారు. నీటి అంశాలపై కూడా ముఖ్యమంత్రికి స్పష్టత లేదని కేటీఆర్ ఆరోపించారు. గోదావరి, భాక్రా నంగల్ వంటి ప్రాజెక్టులపై అసత్య వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా అమలుకాలేదని మండిపడ్డారు. 'ఎనకటి రోజులు తెస్తాం' అని చెప్పిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు వంటి పథకాలు నిలిచిపోయి, ఇప్పుడు రైతులు యూరియా కోసం చలిలో లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని, ఎకరానికి రైతుబంధు, కౌలుదారులకు సాయం, పంట బోనస్, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి హామీలతో ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. ఈ హామీలకు బాధ్యత వహించాల్సింది రాహుల్ గాంధీ అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కేనని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇంటింటికీ తాగునీరు, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రాన్ని ముందుకు నడిపిన కేసీఆర్‌పై కాంగ్రెస్ నాయకులు అడ్డగోలుగా మాట్లాడటం తగదన్నారు. మహిళలకు ఆర్థిక భద్రత, బతుకమ్మ చీరలు, బంగారం వంటి హామీలు కూడా అమలుకాలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రజల మధ్య సీఎం ప్రవర్తన కూడా వివాదాస్పదంగా మారుతోందని వ్యాఖ్యానించారు.

# సింగరేణి ఆసుపత్రుల్లో ఖాళీల భర్తీ



- మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది నియామకం
- 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభం
- సింగరేణి కార్మికుల సంక్షమమే ప్రభుత్వ లక్ష్యం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**


శాసనసభలో సింగరేణి సంస్థకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటనలు చేశారు. సింగరేణి ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది ఖాళీలను మార్చి నాటికి పూర్తిగా భర్తీ చేస్తామని వెల్లడించారు. సింగరేణి కార్మికుల సంక్షమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. గోదావరిఖని ప్రాంతంలో 75 రోజుల్లో క్యాత్ ల్యాబ్‌ను ప్రారంభిస్తామని భట్టి తెలిపారు. రామగుండంలో క్యాత్ ల్యాబ్ నిర్మాణాన్ని పీపీపీ విధానంలో చేపట్టినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్ట్ అవార్డు పూర్తయిందని, నిర్ణీత గడువులోనే సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. సింగరేణి ఆసుపత్రుల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని, 32 మంది డాక్టర్ల నియామకానికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామని భట్టి వివరించారు. అదేవిధంగా 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియ కొనసాగుతోందన్నారు. విశ్రాంత ఉద్యోగులకు కూడా సింగరేణి ఆసుపత్రుల్లో ఔషధ సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. సీపీఆర్ఎంఎస్ పథకం కింద విశ్రాంత ఉద్యోగులు రూ.8 లక్షల వరకు వైద్య సాయం పొందే అవకాశం ఉందని భట్టి చెప్పారు. సింగరేణి పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాల కేటాయింపుపై బోర్డు స్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కేంద్ర విధానాల కారణంగా కొన్ని బొగ్గు గనులు వేలానికి వెళ్లాయని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణికి కొన్ని గనులు దక్కేలా చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

# డీసీపై చర్యలు ఉండేనా...!?

- ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ వర్గాల్లో డిస్కషన్!?
- దేవాదాయ ధర్మదాయ శాఖలో అక్రమాలపై లేఖ కలకలం
- సదరు ఆఫీసర్‌పై చర్యలకు ఉపక్రమించడంలో జాప్యమేలనో?
- ఎంక్వయిరీ ముందుకు సాగుతున్నదో.. లేదోననే చర్చలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

దేవాదాయ ధర్మదాయ శాఖలో వరంగల్ జోన్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ తీరుపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై మహిళా సిబ్బంది ఉన్నతాధికారులకు రాసిన లేఖ వైరల్ అయింది. ఈ క్రమంలోనే సదరు ఆఫీసర్‌పై ఎంక్వయిరీకి ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. కాగా, సదరు ఆఫీసర్‌పై చర్యలుండేనా? అనే చర్చ ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ వర్గాల్లో జరుగుతున్నది. డీసీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే సదరు ఆఫీసర్ వరంగల్ జోన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగినులపై వేధింపులు, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని లెటర్‌లో మహిళా సిబ్బంది పేర్కొన్నారు. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన మహిళలను అవమానకరంగా మాట్లాడుతున్నారని, 'ఏమి వస్తది.. ఏమి రాదు' అంటూ హేళన చేస్తున్నారని లేఖలో వారు ఆరోపించారు. కాగా, ఈ ఆరోపణలపై విచారణ తర్వాత సదరు అధికారిపై చర్యలుంటాయా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమగ్ర విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకుంటారా? లేదా తూతూ మంత్రంగానే ఎంక్వయిరీ ముందుకు సాగుతున్నదా? అనే సందేహాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు.



వేద న్యూస్
2025-12-27
https://epaper.vedhanews.in/

డీసీపై ఎంక్వయిరీ..!?

- 'వేద న్యూస్' కథనానికి స్పందన
- మహిళా సిబ్బంది ఫిర్యాదులపై కమిషనర్ సీరియస్!
- వరంగల్ జోన్ డీసీ వ్యవహారంపై విచారణ ప్రారంభం!

'డీసీ' రాజ్యమా?

- దేవాదాయ ధర్మదాయ శాఖలో దుమారం
- కారుణ్య నియామకాలలో అక్రమాలపై లేఖ కలకలం
- వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ పై తీవ్ర ఆరోపణలు

వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :

దేవాదాయ, ధర్మదాయ శాఖలో కలకలం రేపిన వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్‌పై మహిళా సిబ్బంది చేసిన ఆరోపణల వ్యవహారంలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి.! "డీసీ రాజ్యమా?" పేరిట "వేద న్యూస్" తెలుగు దినపత్రిక ప్రచురించిన కథనంపై డిపార్ట్మెంట్ వర్గాల్లో చర్చ జరిగినట్లు సమాచారం. దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు డీసీపై ఆరోపణలపై విచారణ ప్రక్రియ ప్రారంభమైనట్లు విశ్వసనీయ సమాచారం.మహిళా ఉద్యోగుల వేధింపులు, కక్షసాధింపు చర్యలు, కారుణ్య నియామకాలలో అక్రమాలు, తరచూ బదిలీలు, అవమానకర వ్యాఖ్యలు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది తొలగింపులు, అనధికార నియామకాల అంశాలపై వివరాల సేకరణ మొదలైంది. సంబంధిత ఫైళ్లు, బదిలీ ఆదేశాలు, నియామకాల రికార్డులను విచారణ అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

మహిళా సిబ్బంది వాంగ్మూలాలకు సిద్ధం

లేఖలో పేర్కొన్న ఆరోపణలపై మహిళా సిబ్బంది వాంగ్మూలాలను రికార్డు చేయనున్నట్లు తెలుస్తోంది. వేధింపుల ఆరోపణలపై ప్రత్యక్షంగా బాధితుల నుంచి వివరాలు సేకరించేందుకు సోమవారం విచారణ కమిటీ ముందు హాజరుకానున్నట్లు విశ్వసనీయ సమాచారం.

తాత్కాలిక చర్యలపై చర్చ

విచారణ పూర్తయ్యే వరకు మహిళా ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక చర్యలు తీసుకునే అంశంపై ఉన్నతాధికారులు చర్చిస్తున్నట్లు తెలిసింది. అవసరమైతే బాధ్యతల మార్పు, పరిపాలనా నియంత్రణ వంటి చర్యలు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

నివేదికపై కీలక నిర్ణయాలు?

విచారణ కమిటీ నివేదిక అందిన వెంటనే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత అధికారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఉన్నత వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్త హత్య

- గుండెపోటుగా చిత్రీకరించిన భార్య.. ఆమె ప్రియుడు
- రీ పోస్టుమార్టంతో వెలుగులోకి నిజాలు
- నిజామాబాద్‌లో సంచలన ఘటన

3లో..

# బెస్ట్ డ్యాన్స్ స్టూడియో 'ప్రసంగి'

- 3 నుంచి 60 ఏండ్ల వరకు అందరికీ క్లాసెస్
- సారథిగా 20 ఏండ్ల విశేష అనుభవమున్న మాస్టర్
- ఫిట్‌నెస్ సెంటర్‌గా స్టూడెంట్స్‌కు జుంబా, కరాటే తరగతులూ..
- జాతీయ, రాష్ట్ర స్థాయిలో అవార్డులతో 'ప్రసంగి' విద్యార్థుల ప్ర'ఖ్యాతి'





**వేద న్యూస్, జమ్మికుంట :**

విశ్వజననీమైన కళ 'నాట్యం'. కాగా, ఆధునిక కాలంలో డ్యాన్స్ అనేది ప్రతీ ఒక్కరిని ఆకర్షించే ముఖ్యమైన అంశంగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ఆధునికత, సంప్రదాయాల కలబోతగా డ్యాన్స్‌ను ప్రతీ ఒక్కరికీ నేర్పించాలనే సదుద్దేశంతో ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ 'ప్రసంగి' స్టూడియోను జమ్మికుంట పట్టణంలోని కొండూరు కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. చిన్న'నాట' నుంచే బెస్ట్ డ్యాన్సర్‌గా రాణించి.. డ్యాన్స్ మాస్టర్‌గా 20 ఏండ్ల విశేష అనుభవమున్న ప్రసంగి.. విద్యార్థులు, పెద్దలకు నాట్యం నేర్పుతున్నారు. ఇప్పటికే ప్రసంగి డ్యాన్స్ స్టూడియో విద్యార్థులకు జాతీయ స్థాయిలో, రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు రావడం విశేషం. వేదిక ఏదైనా అక్కడ జమ్మికుంట ఖ్యాతిని నిలబెట్టే దిశగా ప్రసంగి డ్యాన్స్ స్టూడియోను డ్యాన్స్ మాస్టర్ తీర్చిదిద్దుతుండటంతో పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రసంగికి మరిన్ని అవార్డులు వరించి రావాలని, ప్రసంగి కీర్తి మరింతగా పెరగాలని ఆకాంక్షిస్తున్నారు. డ్యాన్స్ అంటే ప్రాణం..డ్యాన్స్ మాస్టర్ ప్రసంగికి డ్యాన్స్ అంటే ఇష్టమే కాదు ప్రాణం అని చెప్పొచ్చు. చిన్న 'నాటి' నుంచి ఎన్నో అవార్డులను ఆయన తన నాట్యకళకు అందుకున్నారు. ప్రసంగి శిష్యులు ఎంతో మంది ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో డ్యాన్స్ మాస్టర్లుగా, కొరియోగ్రాఫర్లుగా రాణిస్తున్నారు. ఈటీవీ మల్లెమాల వంటి ప్రఖ్యాత సంస్థలో ప్రసంగి విద్యార్థులు పని చేస్తున్నారు. ప్రముఖ హీరోయిన్ ఆనంది(రక్షిత)తో పాటు పలువురు ప్రసంగి వద్ద డ్యాన్స్ నేర్చుకున్నారు. వారందరూ ప్రస్తుతం సినీరంగంలో ముందుకెళ్తున్నారు. నాడు జెమినీ టీవీలో నిర్వహించిన 'డ్యాన్స్ బేబీ డ్యాన్స్', ఈటీవీ వారి 'ధమ్ రిథమ్', మా టీవీ వారి 'డుమ్ డుమ్ డిగా డిగా', జీతెలుగు వారి 'ఆట-4,5' వంటి కార్యక్రమాల్లో ప్రసంగి పాల్గొని సత్తా చాటారు. కొరియోగ్రాఫర్‌గా, డ్యాన్స్ మాస్టర్‌గా ఆయన కనబరిచిన ప్రతిభను ఆయా కార్యక్రమాల్లో న్యాయనిర్ణేతలు మెచ్చుకున్నారు. 'ప్రసంగి' డ్యాన్స్ స్టూడియోలో మాస్టర్లు సిద్ధు, సంజయ్, సరిత, విశ్వరాజ్(కె.రాజేశ్)లు అందుబాటులో ఉంటారు. ప్రసంగి డ్యాన్స్ స్టూడియో ప్రొప్రైటర్‌గా డ్యాన్స్ మాస్టర్ ప్రసంగి సతీమణి ఎన్.శ్రీలత నిత్యం స్టూడియోలో అందుబాటులో ఉంటారు. ఉన్నత లక్ష్యంతో ముందడుగు..తన ప్రాంతానికి తన వంతుగా సేవ చేయాలని, కళను ప్రోత్సహిస్తూ.. కళాకారులకు దిశానిర్దేశం చేయాలని, సన్మార్గం వైపు తన ప్రాంత యువత నడవాలనే సమున్నత లక్ష్యంతో ఆచరణలో ముందుకు అడుగు వేసిన యువకెరటం ప్రసంగి అని చెప్పొచ్చు. జమ్మికుంట పట్టణ, మండల, పరిసర, సమీప ప్రాంత యువత చెడు మార్గం వైపు అసలు వెళ్లకుండా..సన్మార్గం వైపు మాత్రమే నడిచేలా.. వారిని నాట్య కళ వైపునకు మళ్లించేలా ప్రసంగి డ్యాన్స్ స్టూడియో నెలకొల్పగా, సత్ఫలితాలు వస్తున్నాయి.


ఇప్పటికే 'ప్రసంగి' విద్యార్థులు పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో అవార్డులు గెలుచుకుని జమ్మికుంట, 'ప్రసంగి' స్టూడియో ఖ్యాతిని నిలబెడుతున్నారు. ఉన్నత విద్యావంతుడు మాస్టర్ ప్రసంగిఉన్నత విద్యావంతుడు అయిన ప్రసంగి సారథ్యంలో స్టూడియో మరింత ముందుకు సాగుతుందని పలువురు పట్టణవాసులు ఆకాంక్షిస్తున్నారు. ప్రసంగి డ్యాన్స్ స్టూడియోలో జాయిన్ అయిన ప్రతీ ఒక్కరినీ డ్యాన్స్ మాస్టర్లు మానిటర్ చేస్తూ.., టీమ్ పరంగానే కాక ఇండివిడ్యువల్‌గానూ ప్రతీ ఒక్కరు ఎక్సెల్ అయ్యేలా శ్రద్ధ కనబరుస్తున్నారు. వారికి సరైన గైడెన్స్‌నూ ఇస్తున్నారు. జమ్మికుంట పట్టణంలోని వైద్యులు సైతం దాదాపుగా ప్రసంగి డ్యాన్స్ స్టూడియోలో డ్యాన్స్ నేర్చుకుంటున్నారు. ఈ




స్టూడియోలో ప్రతీ ఒక్క పండుగను అందరూ సెలబ్రేట్ చేసుకునేలా వేడుకలు ఏర్పాటు చేస్తుండటం విశేషం. కుల, మతాలకు అతీతంగా అందరూ ఒక్కటే అని సందేశాన్ని విద్యార్థులో నింపేందుకు ఈ ఏర్పాట్లు ఉపయోగపడతాయి. స్టూడియోలో ప్రస్తుతం 30 మంది పిల్లలతో పాటు 8 మంది పెద్దలకు డ్యాన్స్ క్లాసెస్ నడుస్తున్నాయి. జుంబా ఇన్‌స్ట్రక్టర్‌గా అంతర్జాతీయంగా ధ్రువీకరణ పత్రం పొందిన డ్యాన్స్ మాస్టర్‌గా ప్రసంగి నిలవడం విశేషం. జుంబా, యువతులు, మహిళలకు కరాటేతో పాటు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌ను ప్రసంగి నేర్పిస్తున్నారు.

## కళాకారులకు ప్రోత్సాహమే లక్ష్యం : డ్యాన్స్ మాస్టర్ ప్రసంగి

జమ్మికుంట పట్టణ, మండల, పరిసర, సమీప ప్రాంతాల్లోని కళాకారులను ప్రోత్సహించడమే నా లక్ష్యం. ఈ ప్రాంతంలోని ఆర్టిస్టులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు కరీంనగర్, వరంగల్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నది. అలా కాకుండా వారికి సమీపంలోని జమ్మికుంటలో ఉంటూ.. వారిని ప్రోత్సహిస్తూ.. వారిలో ధైర్యం, ఆత్మ విశ్వాసాన్ని నిండుగా, మెండుగా నింపుతూ.. వారిని వారి లక్ష్యం వైపు ముందుకు నడిపించడమే నా టార్గెట్. పిల్లలకు వారి చదువుల విషయంలోనూ సరైన మార్గనిర్దేశనం చేస్తా. నెలకోసారి వారి ఎడ్యుకేషన్ విషయమై దృష్టి సారిస్తా. 24/7 స్టూడియోలో అందుబాటులో ఉంటూ..వారి నడత, నడక సన్మార్గంలో ఉండేలా నా వంతు సూచనలు, సలహాలు ఇస్తా. ముఖ్యంగా చిన్నారులకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నేర్పిస్తా. అమ్మాయిలను అనుకోని పరిస్థితులు ఏవి ఎదురైనా తట్టుకుని నిలబడగలిగే



శక్తిమంతులుగా తీర్చిదిద్దేందుకు నా వంతు కృషి చేస్తా. విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లో 'ఆత్మహత్య' అనే ఆలోచన రాకుండా.. వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు ప్రయత్నిస్తా.

## బెస్ట్ డ్యాన్స్ స్కూల్: జమ్మికుంటవాసులు

ప్రసంగి డ్యాన్స్ స్టూడియోలో మాస్టర్ ప్రసంగి డ్యాన్స్‌ను చాలా చక్కగా నేర్పిస్తారని స్టూడియోలో డ్యాన్స్ నేర్చుకుంటున్న మహిళలు పేర్కొన్నారు. అసలేమీ రాని తమకు చక్కగా ఓపికతో స్టెప్స్ నేర్పించి.. తమ కుటుంబ సభ్యులు అందరూ మెచ్చుకునేలా చక్కటి డ్యాన్స్‌ను




నేర్పించారని 'ప్రసంగి' స్టూడెంట్స్ పేర్కొన్నారు. 'ప్రసంగి' డ్యాన్స్ స్టూడియో విద్యార్థులలో జమ్మికుంట పట్టణంలోని ప్రముఖులు, వైద్యులు ఉండటం విశేషం. చక్కటి డ్యాన్స్‌ను మాస్టర్ ప్రసంగి అందరికీ నేర్పుస్తున్నారని వారు అభిప్రాయపడ్డారు. 'ప్రసంగి' ఖ్యాతి మరింతగా విస్తరిస్తుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు.

## ఇక్బాల్‌ను కలిసిన జూనియర్ అసిస్టెంట్‌లు

**వేద న్యూస్, వరంగల్:**



వీఆర్‌ఏ నుంచి జూనియన్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందిన వరంగల్ జిల్లాఅబశ్రీ-శ్రీలోని అభ్యర్థులు మంగళవారం టీజీటీఏ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఇక్బాల్‌ను కలిశారు. ఆయనకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జూనియర్ అసిస్టెంట్‌ల ప్రొబేషన్ ప్రక్రియను రెండు మూడు రోజులలో పూర్తి చేపిస్తానని, రెండో ఇంక్రిమెంట్ ఇప్పిస్తానని ఇక్బాల్ హామీ ఇచ్చినట్టు వారు పేర్కొన్నారు. ఇక్బాల్‌ను కలిసిన వారిలో టీజీఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమాండ్ల రాజు, సురేష్, గణేష్, సంజీవ, ప్రవీణ్, శోభ మాధవి ఉన్నారు.

## వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్అబశ్రీశ్రీను ఆహ్వానించారు. వీరభద్రస్వామి సమేత భద్రకాళి దేవి కల్యాణ మహోత్సవంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న క్రమంలో స్వామి వారి సన్నిధికి రావాలని.. డీసీని మంగళవారం వీరభద్రస్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారి పి.కిషన్ రావు, ఉప ప్రధానార్చక కంచనపల్లి రాజయ్య, ముఖ్య అర్చక గుడ్ల శ్రీకాంత్, హుస్నాబాద్ టౌన్ రేణుక ఎల్లమ్మ దేవాలయ అర్చక చాటికొండ పరమేశ్వర్ ఆహ్వానించారు. ఆహ్వానపత్రికను అందజేశారు.

## 'యూరియా' క్యూలో మద్యం బాటిల్!

- చెప్పులతో పాటు లైన్లో మందు సీసా
- మొదట ఆశ్చర్యం.. రైతు తిప్పలకు ప్రతిబింబం
- వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం ఘటన

**వేద న్యూస్, వరంగల్:**

ప్రభుత్వాలు మారుతున్నాయి, హామీలు వెల్లువెత్తుతున్నాయి, కానీ రైతన్నల కష్టాలు మాత్రం తీరడం లేదు. 'యూరియా కొరత లేదు.. యాప్‌లో బుక్ చేసుకుంటే నేరుగా ఇంటికే వస్తుంది.. రైతులు గంటల కొద్దీ నిల్చోవాల్సిన అవసరం లేదు' అంటూ పాలకులు చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో నీటి మూటలనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి సజీవ సాక్ష్యమే వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామపంచాయతీ వద్ద కనిపించిన ఈ దృశ్యం.

**ఎండలో నిలబడలేక..**

యూరియా బస్తా కోసం రైతులు తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాస్తున్నారు. గంటల తరబడి ఎండలో నిలబడటం సాధ్యం కాక, తమ వంతు ఎప్పుడు వస్తుందోనన్న ఆశతో రైతులు తమ చెప్పులను వరుస క్రమంలో లైన్‌లో పెట్టారు. వరుసలు తప్పకుండా ఉండేందుకు మధ్య మధ్యలో ఆకులు, కొమ్మలను కూడా క్యూలో పెట్టడం అక్కడ పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

**ఆశ్చర్యపరిచిన మద్యం సీసా..**




అయితే.. ఈ చెప్పుల క్యూలో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది ఒక మద్యం సీసా. సాధారణంగా చెప్పులు, రాళ్లు, సంచులు లైన్‌లో పెట్టడం చూస్తుంటాం, కానీ ఒక రైతు ఏకంగా 'రాయల్ స్టాగ్ల సీసాను లైన్‌లో పెట్టడం చర్చనీయాంశం గా మారింది. ఇది చూసిన ఇతర రైతులు మొదట ఆశ్చర్య పోయినా, ఆ తర్వాత 'మా కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదు, అందుకే ఇలా వినూ త్నంగానైనా మా గోడు విని పిస్తున్నాం..' అంటూ చర్చి ంచుకుంటున్నారు. డిజిట ల్ యుగంలో యాప్‌ల ద్వారా యూరియా పంపిణీ చేస్తామని ప్రభుత్వం గొప్పగా చెబుతున్నా, రుద్రగూడెం వంటి గ్రామాల్లో మాత్రం రైతులు ఇంకా పాత కాలపు కష్టాలనే అనుభవిస్తున్నారు.

**పనిచేయని యాప్..**

సాంకేతిక సమస్యల వల్ల యాప్‌లో బుకింగ్ సాధ్యం కావడం లేదని రైతులు వాపోతున్నారు. స్టాక్ లేదనే సాకుతో రోజుల తరబడి తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వయసు పైబడిన రైతులు కూడా ఎండలో గంటల తరబడి వేచి చూడలేక ఇలా చెప్పులను వరుసలో పెట్టి చెట్ల కింద విశ్రాంతి తీసుకుంటున్నారు.

## సమ్మక్క సారక్క జాతర చైర్మన్‌గా నారాయణరెడ్డి

వేద న్యూస్, హుజూరాబాద్:

కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం సమ్మక్క సారక్క జాతర చైర్మన్‌గా రిక్కల నారాయణ రెడ్డిని ఎన్నుకున్నారు. మంగళవారం గ్రామంలోని అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రిక్కల నారాయణరెడ్డిని చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామస్తులు ఒక ప్రకటనలో తెలిపారు. జాతర విజయవంతం కోసం పార్టీలకతీతంగా సమష్టిగా కృషి చేయాలని, తనను ఏకగ్రీవంగా ఎన్ను కున్న గ్రామ కులసంఘల పెద్దలు, గ్రామస్థులకు,అన్ని రాజకీయ పార్టీల నాయకులకు రిక్కల నారాయణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



# మొక్కుబడి..

# రోడ్ సేఫ్టీ..!!




- ☐ డబ్బు వృథా ఈవెంట్లుగా 'రోడ్డు భద్రత వారోత్సవాలు'
- ☐ వేదికలపై భద్రత.. రోడ్లపై మృత్యు గోతులు
- ☐ లక్షలు ఖర్చు.. ఫలితం శూన్యం
- ☐ ముగ్గులు, ఫ్లెక్సీల ప్రచారంతో ప్రమాదాలు ఆగేనా?
- ☐ రోడ్లపై గుంతల బాధ్యత ఎవరిది?
- ☐ సైన్ బోర్డులు లేవు.. స్పీడ్ బ్రేకర్లు ఉండవు
- ☐ సెల్ ఫోన్ డ్రైవింగ్‌పై కనిపించని కాఠిన్యత
- ☐ మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ పట్టదా?
- ☐ 'టార్గెట్ల' కోసమే మొక్కుబడి చలాన్లు
- ☐ శాఖల మధ్య కానరాని సమన్వయం
- ☐ పౌరులుగా మనమూ రోడ్డు భద్రత అందరి బాధ్యత
- ☐ ఒక్క ప్రమాదం.. ఒక కుటుంబానికి శాపం

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

ప్రతి సంవత్సరం జనవరి వచ్చిందంటే రోడ్డు భద్రతా వారోత్సవాలు మొదలవుతాయి. ప్రభుత్వ శాఖలు, పోలీస్ విభాగాలు, రవాణా అధికారులు, స్థానిక సంస్థలు కలిసి ర్యాలీలు, సభలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు, సోషల్ మీడియా ప్రచారం, ప్రమాణాలు, పిల్లలతో కార్యక్రమాలు అన్నీ జరుగుతాయి. ప్రభుత్వ కార్యాలయాలు రంగురంగుల పోస్టర్లతో నిండిపోతాయి. ట్రాఫిక్ జంక్షన్లలో అధికారులు ముగ్గులు వేస్తారు, బెలూన్లు వదులుతారు, పెద్ద పెద్ద హోర్డింగులు పెడతారు. కోట్లాది రూపాయల ప్రజల సొమ్ము ప్రచారానికే సరిపోతోంది. కానీ, ఈ హంగామా ముగిసిన మరుసటి రోజే అదే రోడ్డుపై ఉన్న గుంతలో పడి ఓ ప్రాణం గాల్లో కలుస్తుంది. అవే మరణాలు కొనసాగుతుండటమే ఇప్పుడు ప్రజల్లో పెద్ద ప్రశ్నగా మారింది. రోడ్డు భద్రతా వారోత్సవాల అసలు ఉద్దేశం ఏమిటి? అసలు ఈ వారోత్సవాల లక్ష్యం నెరవేరుతుందా? లేక ఫోటోలకు ఫోజులిచ్చి కోట్లు కొల్లగొట్టే ఈవెంట్గా మారిందా? నిజంగా ప్రమాదాలను నివారించడమేనా? లేక ప్రతి ఏడాది తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఒక మొక్కుబడి కార్యక్రమంగా మారిపోయిందా అన్న సందేహాలు బలపడుతున్నాయి. రోడ్డు ప్రమాదాలను 50శాతం తగ్గించాలన్న లక్ష్యంతో మొదలైన ఈ వారోత్సవాలు, ప్రతి ఏటా మరణాల సంఖ్య పెరుగుతున్నా ఏమాత్రం వెనక్కి తిరిగి చూడటం లేదు.

**– ఏటా లక్షల్లో గాల్లో కలుస్తున్న ప్రాణాలు**

ప్రభుత్వ గణాంకాలే చెబుతున్న వాస్తవం ఏమిటంటే, దేశంలో ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంకా లక్షల మంది శాశ్వతంగా క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రోడ్డు భద్రతా వారోత్సవాల ద్వారా లక్ష్యాలు నెరవేరుతున్నాయా అని చూస్తే సమాధానం స్పష్టంగా కనిపించడం లేదు. వారం రోజుల పాటు అవగాహన పేరుతో కార్యక్రమాలు జరిగిపోతాయి కానీ ప్రమాదాల సంఖ్యలో గణనీయమైన తగ్గుదల మాత్రం కనిపించడంలేదు. ఇదే విషయాన్ని ప్రజలు, రోడ్డు భద్రత నిపుణులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.

**– ముగ్గులతో యాక్సిడెంట్స్ తగ్గిస్తారా?**

ఇటీవలి కాలంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ఎక్కువగా కనిపిస్తున్న దృశ్యం ముగ్గులు. చౌరస్తాల్లో, ప్రభుత్వ కార్యాలయాల ముందు, స్కూళ్లలో రంగు రంగుల ముగ్గులు వేస్తూ రోడ్డు భద్రత సందేశాలు రాస్తున్నారు. కానీ రోడ్డు ప్రమాదాలకు అసలు కారణాలేంటో చూసినప్పుడు ముగ్గులకు వాటితో ఎలాంటి సంబంధం ఉందన్న ప్రశ్న తలెత్తుతోంది. రోడ్లపై ఉన్న గుంతలు, సరైన సైన్ బోర్డుల లేమి, ప్రమాదకర మలుపులు, అస్తవ్యస్తమైన యూ–టర్న్‌లు, చీకటి రోడ్లు.. ఇవన్నీ ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉంటే, వాటిని పరిష్కరించకుండా ముగ్గులతో అవగాహన కల్పించడమే రోడ్డు భద్రతగా ఎలా మారింది అన్న ప్రశ్న ప్రజల్లో వినిపిస్తోంది.

**– అడుగడుగునా మృత్యు గొయ్యి..**

ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. నగరాల్లోనూ, గ్రామాల్లోనూ అడుగడుగునా గుంతలే దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే ఆ గుంతలు నీటితో నిండిపోయి మరణ కూపాలుగా మారుతున్నాయి. రాత్రి వేళ డ్రైవింగ్ చేసే వారికి అవి కనిపించకపోవడంతో బైక్‌లు స్కిడ్ అవుతున్నాయి, కార్లు బోల్తా పడుతున్నాయి, బస్సులు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ గుంతల కారణంగా ప్రతి ఏడాది ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు, ఇంకా ఎంతో మంది క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాలతో పాటు జిల్లాల్లోని అంతర్గత రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. రోడ్డు భద్రతా నిధులు ప్రచారానికి వాడే అధికారులు, ఆ నిధులతో కనీసం అత్యంత ప్రమాదకరమైన గుంతలను ఎందుకు పూడ్చడం లేదు? ఆర్అండ్బీ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా సామాన్యుడి ప్రాణం బలైపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తే సరిపోతుందా? ఈ గుంతలను పూడ్చే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**– చీకట్లో ప్రయాణం.. మృత్యువుతో పోరాటం..**

రోడ్డు భద్రత అంటే కేవలం డ్రైవర్ తప్పిదాలే కాదు. రోడ్డు మౌలిక సదుపాయాలే ప్రమాదాలకు ప్రధాన కారణమయ్యే సందర్భాలు అనేకం ఉన్నాయి. చాలా చోట్ల రోడ్లపై సరైన సైన్ బోర్డులు లేవు. ఒక వాహనదారుడు సురక్షితంగా గమ్యం చేరాలంటే రోడ్డుపై సైన్ బోర్డ్స్ ప్రాణం వంటివి. కానీ మన రోడ్లపై ఎక్కడ యూటర్న్ ఉందో, ఎక్కడ స్పీడ్ బ్రేకర్ ఉందో తెలిపే బోర్డులు ఉండవు. మలుపు ఉందని చెప్పే హెచ్చరిక బోర్డులు కనిపించవు. యూ–టర్న్ దగ్గర స్పష్టమైన సూచికలు ఉండవు. పెట్రోల్ బంక్, జంక్షన్, స్పీడ్ బ్రేకర్ ముందే ఉందని తెలియజేసే బోర్డులు లేకపోవడం వల్ల డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయాల్సి వస్తోంది. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురవుతోంది. సైన్ బోర్డుల లేకపోవడం ఎంత ప్రమాదకరమో ప్రతిరోజూ రోడ్లపై కనిపిస్తున్న దృశ్యాలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఒక వేళ ఉన్నా అవి చెట్ల పొదల్లోనో, తుప్పు పట్టి కనిపించకుండా పోతున్నాయి. రాత్రి వేళల్లో డివైడర్లు సరిగ్గా కనిపించక వాటిని ఢీకొట్టి మరణించే వారి సంఖ్య అధికం. కనీసం రేడియం స్టిక్కర్లు వేసే నాథుడే కరువయ్యాడు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతాయని తెలిసిన ప్రాంతాల్లో కనీస హెచ్చరిక బోర్డులు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట.




**– బాధ్యత ఏ శాఖది??**

అసలు రోడ్డు భద్రత అనే అంశం ఒక్క శాఖ పరిధిలోకి వచ్చే విషయం కాదు. రవాణా శాఖ, పోలీస్ శాఖ, ఆర్ అండ్ బీ, మున్సిపల్ శాఖలు, జాతీయ రహదారి సంస్థలు, స్థానిక సంస్థలు... ఇలా అనేక శాఖలు దీనికి సంబంధించిన బాధ్యతలు కలిగి ఉంటాయి. కానీ ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం దొరకడం లేదు. ఒక శాఖ మరో శాఖపై నెట్టేయడం, ఫైళ్లలోనే చర్యలు పరిమితం కావడం వల్ల సమస్య పరిష్కారం కాకుండా అలాగే కొనసాగుతోందన్న విమర్శలు పెరుగుతున్నాయి. రోడ్డు భద్రత అంటేనే ఒక చైన్ సిస్టమ్ లాంటిది. మద్యం సేవించి వాహనం నడిపేవారిని, అతివేగాన్ని పోలీస్ శాఖ అడ్డుకోవాలి. కానీ ఇవి కేవలం సిటీల్లో వారి 'టార్గెట్ల' కోసం జరుగుతున్నాయి. ఇక రావాణాశాఖ లైసెన్సుల జారీలో కఠినంగా ఉండాలి.. వాహనాల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలి.. కానీ వారి అంతులేని అవినీతి వల్ల అనర్హులకు కూడా స్టీరింగ్ అందుతోంది. దాని వల్ల వారి ప్రాణాలే కాదు.. అమాయకుల ప్రాణాలు కూడా పోతున్నాయి. రోడ్ల నిర్మాణం లోపభూయిష్టంగా ఉండడంలో ఇంజనీరింగ్ విభాగంది అందెవేసిన చేయి. అర్థంపర్థం లేని మూలమలుపులు.. అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్లు ప్రమాదాలకు కారణాలవుతున్నాయి.

**– నియమాలు గాలికి...**

ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతో పాటు ప్రజలు కూడా ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఒక్క ఫోన్ కాల్ ప్రాణం తీస్తోంది. బైక్ నడుపుతూ మెడలో ఫోన్ పెట్టుకుని మాట్లాడటం సర్వసాధారణమైపోయింది. దీంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఇక మైనర్లకు, డ్రైవింగ్ సరిగా రాని వారి చేతికి బండి ఇవ్వడం అంటే వారికి డెత్ వారెంట్ రాసి ఇచ్చినట్లే. హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు పాడవుతుందని అనుకునేవారు చాలా మంది ఉన్నారు.. హెల్మెట్ ను భారంగా, చిరాకుగా భావించడం వల్ల ఏవైనా చిన్న ప్రమాదాలు తగిలినా తలకు బలమైన దెబ్బ తగలడంతో జీవితమే పాడవుతుందని గ్రహించడం లేదు. అయితే ఈ అంశాలపై చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ అమలు మాత్రం చాలా చోట్ల సడలించినట్టుగా ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టుబడితే కొన్నిసార్లు హెచ్చరికలతో వదిలేయడం, రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లతో కేసులు బలహీనపడటం వల్ల నిబంధనల పట్ల భయం తగ్గుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనల పట్ల భయం లేకపోతే ప్రమాదాలు తగ్గడం సాధ్యమా అన్న ప్రశ్న సహజంగా ఉత్పన్నమవుతోంది.

**– ఒక ప్రాణం.. ఒక కుటుంబ జీవితకాల శోకం..**

రోడ్డు ప్రమాదం అంటే ఒక్క వ్యక్తి ప్రాణం పోవడం మాత్రమే కాదు. ఆ ఒక్క ప్రమాదంతో కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి వస్తుంది. తండ్రిని కోల్పోయిన కుటుంబం ఆర్థికంగా కుదేలవుతుంది. తల్లిని కోల్పోయిన పిల్లల భవిష్యత్తు చీకటమవుతుంది. యువకుడు లేదా యువతి చనిపోతే ఒక ఇంటి కలలు శాశ్వతంగా ముగిసిపోతాయి. రోడ్డు ప్రమాదాల ప్రభావం ఒక్క రోజుతో ముగిసేది కాదు, అది కుటుంబాలు జీవితాంతం మోయాల్సిన బాధ. రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత పౌరులుగా అందరిపై ఉంది.. అంతేకాదు వారోత్సవాలు కేవలం కోట్లు ఖర్చు చేసే ఈవెంట్ లా కాకుండా, రోడ్లపై ఉన్న ఒక్క గుంతనైనా పూడ్చేలా, ఒక్క మలుపునైనా సరిదిద్దేలా ఉండాలి. అధికారులు ఫోటోల కోసం కాకుండా, చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే రోడ్డు భద్రత కు అసలైన అర్థం లభిస్తుంది.

**– చిత్తశుద్ధితో చేయాలి..**

ప్రతి ఏడాది రోడ్డు భద్రత పేరుతో లక్షల నుంచి కోట్ల రూపాయల వరకు ఖర్చవుతున్నాయి. అవగాహన కార్యక్ర మాలు, ప్రచారాలు, ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. కానీ ప్రమాదాల సంఖ్య, మరణాల గణాంకాలను చూసినప్పుడు ఈ ఖర్చు నిజంగా ప్రాణాల రక్షణకు ఉపయోగపడుతోందా అన్న సందేహం ప్రజల్లో కలుగుతోంది. ఫొటోలు దిగేందుకు, నివేదికలు తయారు చేసేందుకు, ఫైళ్లలో పనులు పూర్తయినట్టు చూపించేందుకు మాత్రమే ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయా అన్న ప్రశ్నలు ఇప్పుడు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితులన్నింటిని చూస్తే ఒక ప్రశ్న తప్పదు. రోడ్డు భద్రతా వారోత్సవాలు నిజంగా చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నారా? లేక ప్రతి ఏడాది చేయాల్సిందే కాబట్టి చేస్తున్నామా? రోడ్డు భద్రత అంటే వారం రోజుల కార్యక్రమాలు కాదు, నిరంతర చర్యలు. పోస్టర్లు కాదు, సురక్షిత రోడ్లు. మాటలు కాదు, కఠిన అమలు. ప్రజల ప్రాణాల విలువను నిజంగా అర్థం చేసుకున్న పాలన ఉంటేనే రోడ్డు భద్రత అనే మాటకు అర్థం ఉంటుంది. ఎందుకంటే ఒక్కరి ప్రాణం పోతే, ఆ బాధ ఒక్కరికే కాదు.. ఒక కుటుంబానికి, ఒక సమాజానికి తీరని నష్టంగా మిగిలి పోతుంది.

---

## సామాజిక తెలంగాణ కోసం కలిసి నడుద్దాం

- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఉద్యమకారులు, ఉద్యోగులు, విద్యార్థుల సంపూర్ణ మద్దతు
- ప్రజా, కుల, కార్మిక సంఘాల సంఘీభావం
- బంజారాహిల్స్‌లో జాగృతి కార్యాలయంలో భారీ సమీకరణ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

సామాజిక తెలంగాణ సాధన కోసం అందరం కలిసి నడుద్దామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం పనిచేసే కొత్త రాజకీయ శక్తి అవసరమని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, కుల సంఘాలు, వివిధ యూనివర్సిటీల విద్యార్థి సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవితను కలిసి వారు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జాగృతి కార్యకర్తలు, అభిమానులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, కుల సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు, సింగరేణి కార్మికులు, ఉద్యమకారులు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం మీ ఆధ్వర్యంలో రాబోయే పార్టీకి మా సంపూర్ణ మద్దతు ఉంటుందని కవితకు భరోసా ఇచ్చారు. సామాజిక



న్యాయం, సమానత్వం, ఉద్యమకారుల గౌరవం కేంద్రంగా రాజకీయాలు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కవితను కలిసిన వారిలో సింగరేణి కార్మికులు, హెచ్ఎంఎస్ ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, బీసీ సంఘం, అన్ని యూనివర్సిటీల విద్యార్థి సంఘాలు, తొలి మరియు మలి దశ ఉద్యమకారుల జేఏసీలు, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ, ఉద్యమకారుల జేఏసీ స్టేట్ కమిటీ, తెలంగాణ పొలిటికల్ జేఏసీ, ఆటో యూనియన్ నాయకులు, మహిళా సంఘాలు, కుల సంఘాల బాధ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు. ఈ విస్తృత మద్దతు సామాజిక తెలంగాణ సాధనకు బలమైన పునాదిగా మారుతుందని నేతలు పేర్కొనగా, తెలంగాణ జాగృతి ఈ లక్ష్యంతో ప్రజలతో కలిసి ముందుకు సాగుతుందని కవిత స్పష్టం చేశారు.

---

## ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్త హత్య

**వేద న్యూస్, నిజామాబాద్:**



నిజామాబాద్‌లో భర్త హత్య కేసు సంచలన మలుపు తిరిగింది. ఇన్సూరెన్స్ డబ్బుల కోసమే భార్య తన భర్తను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. మృతుడు పల్లటి రమేష్ పేరిట రూ.2 కోట్లకు పైగా ఇన్సూరెన్స్ పాలసీలు ఉండటమే ఈ నేరానికి కారణమని పోలీసులు వెల్లడించారు. వివరాల ప్రకారం.. భార్య సౌమ్యకు ప్రియుడు దిలీప్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ సంబంధానికి అడ్డు తొలగించుకోవడంతో పాటు ఇన్సూరెన్స్ డబ్బులతో పారిపోవాలనే ఉద్దేశంతో ఇద్దరూ కలిసి పక్కా ప్లాన్ రూపొందించినట్లు దర్యాప్తులో బయటపడింది. భర్తకు నిద్రమాత్రలు ఇచ్చి గొంతు నులిమి హత్య చేసి, గుండెపోటుతో సహజ మరణం జరిగినట్లు చిత్రీకరించినట్లు పోలీసులు తెలిపారు. ప్రారంభంలో కుటుంబ సభ్యులు కూడా ఇది సహజ మరణమేనని భావించారు. అయితే మృతుడి తమ్ముడు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శవానికి రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఆ నివేదికలో హత్యకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలు లభించడంతో కేసు కీలక మలుపు తిరిగింది. పోలీసుల లోతైన విచారణలో భార్య సౌమ్య, ప్రియుడు దిలీప్ ఇద్దరూ హత్య చేసినట్లు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం చేసిన ఈ హత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

వేద న్యూస్

బుధవారం జనవరి 07, 2026

# చైనా మాంజాను ఎవరూ వాడొద్దు

- నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు
- సురక్షత ప్రాంతాల్లోనే గాలిపటాలు ఎగురవేయాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

**వేద న్యూస్, మెదక్:**



మెదక్ జిల్లా పరిధిలో చైనా మాంజాను పూర్తిగా నిషేధించినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఉల్లంఘిస్తూ చైనా మంజాను విక్రయించినా, వినియోగించినా లేదా దాని కారణంగా ఎవరికైనా ప్రమాదం సంభవిస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాబోయే సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని, జిల్లా వ్యాప్తంగా సీసీఎస్ పోలీసులతో పాటు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారయ్యే చైనా మాంజా పర్యావరణానికి తీవ్ర హాని కలిగించడమే కాకుండా, ప్రజలు, వాహనదారులు, పక్షలకు ప్రాణాపాయం కలిగించే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. గతంలో చైనా మాంజాతో గాలిపటాలు ఎగురవేసే సమయంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, కొన్నిసార్లు గాలిపటాలు ఎగురవేసే వ్యక్తులు కూడా తీవ్రంగా గాయపడిన ఘటనలు నమోదయ్యాయని తెలిపారు. ఈ కారణాల దృష్ట్యానే చైనా మంజాపై సంపూర్ణ నిషేధం విధించబడిందని జిల్లా ఎస్పీ వివరించారు. ప్రజలు చైనా మంజాను ఉపయోగించకుండా, ఎవరికీ హాని కలగని సాధారణ దారాలతో గాలిపటాలు ఎగురవేయాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. గాలిపటాలు ఎగురవేసే వారు తప్పనిసరిగా కరెంట్ స్థంభాలకు దూరంగా, మైదానాలు వంటి సురక్షత ప్రదేశాల్లోనే గాలిపటాలు ఎగురవేయాలని సూచించారు. అలాగే బిల్డింగులపై నుంచి గాలిపటాలు ఎగురవేసే వారు తగిన భద్రతా చర్యలు పాటిస్తూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఎవరైనా చైనా మాంజా విక్రయాలు లేదా వినియోగం గమనించినట్లయితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.

# ఎన్‌సీడీ స్క్రీనింగ్‌పై దృష్టి సారించాలి

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ - ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**



ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) స్క్రీనింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ముందుగానే వ్యాధి లక్షణాలను గుర్తించడం ద్వారా అవసరమైన చికిత్స సకాలంలో అందించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఓపీ రిజిస్టర్, ల్యాబ్, ఇమ్యూనైజేషన్ గది, ఇన్‌పేషెంట్ గదులు, ఇతర విభాగాలు, ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్, క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్లు, గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచే దిశగా కృషి చేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రసవాల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్న ఇంచార్జి కలెక్టర్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు నిరంతరం కృషి చేయాలని పునరుద్ఘాటించారు. ఆసుపత్రి ఆవరణం, పరిసరాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు.

# తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం

**వేద న్యూస్, వరంగల్:**



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, కమిషనర్, ఎంహెచ్ఓ రాజేష్ ఆదేశాల మేరకు 42వ డివిజన్ రంగసాయిపేట పరిధిలోని తెలంగాణ కాలనీలో తడి చెత్త-పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సానిటరీ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తడి చెత్తను ఒక డబ్బాలో, పొడి చెత్తను మరో డబ్బాలో వేరు వేరుగా వేయాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రోడ్లపై లేదా కాలువల్లో వేయకుండా మున్సిపాలిటీ సూచనలను పాటించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సహకారం అందించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సానిటరీ జవాన్ వాస్కుల ప్రణీత్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# హౌసింగ్ ఏఈకి సన్మానం

**వేద న్యూస్, రుద్రూర్:**



మండల గృహ నిర్మాణశాఖ ఏఈగా సౌజన్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులు ఏఈ సౌజన్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని, లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఏఈను కోరారు. గృహ నిర్మాణ పథకాలు సమర్థవంతంగా అమలయ్యేలా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాల గంగాధర్, నాయకులు పత్తి రాము, పత్తి లక్ష్మణ్, అక్కపల్లి నాగేందర్, తోట సంగయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కే.వి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# హెూంగార్డ్ దేవయ్య కుటుంబానికి అండగా ఉంటాం

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా పోలీస్ శాఖలో 26 సంవత్సరాలుగా నిబద్ధతతో విధులు నిర్వహించిన హెూం గార్డ్ దేవయ్య మరణం పోలీస్ వ్యవస్థకు తీరని లోటని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పేర్కొన్నారు. దేవయ్య కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. సోమవారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో సిరిసిల్ల బైపాస్ ప్రాంతంలోని క్రషర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవయ్య మృతి చెందారు. ఈ సందర్భంగా దేవయ్య అంత్యక్రియల్లో జిల్లా ఎస్పీతో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొని, పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. దేవయ్య పోలీస్ శాఖలో 26 ఏళ్లపాటు నిజాయితీగా సేవలందించారని, ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ఎస్పీ తెలిపారు. స్వర్గస్తులైన దేవయ్యకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారని, బాధిత కుటుంబానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు పోలీస్ శాఖ తరఫున అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు డీఎస్పీ నాగేంద్రచారి, సీఐలు నాగేశ్వరరావు, రవి, మొగిలి, ఆర్ఐలు మధుకర్, యాదగిరి, రమేష్, ఎస్ఐ ఉపేంద్రచారి తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్ట్ షాపునకు బహిరంగ వేలం?!

- గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలో ఘటన
- గ్రామస్తుల నుంచి వెల్లువెత్తుతున్న విమర్శలు



**వేద న్యూస్, గంభీరావుపేట:**

బెల్ట్ షాపు నిర్వహణ కోసం బహిరంగ వేలం నిర్వహించినట్లు సమాచారం వెలుగులోకి రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. మద్యం విక్రయాలపై నియంత్రణ అవసరమన్న డిమాండ్లు వినిపిస్తున్న తరుణంలో బెల్ట్ షాపు వేలం నిర్వహించడం పలు విమర్శలకు కారణమవుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇటీవల పలు గ్రామాల్లో నూతన సర్పంచులు బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించిన వారు కొందరు గ్రామాలను మద్యపాన రహితంగా తీర్చిదిద్దేందుకు తీర్మానాలు కూడా చేస్తున్నారు. గ్రామాల్లో మద్యనిషేధాన్ని ప్రోత్సహిస్తూ ఆదర్శంగా నిలిచే ప్రయత్నాలు జరుగుతున్న ఈ సందర్భంలో... మల్లారెడ్డిపేట గ్రామంలో తీసుకున్న ఈ నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామ నడిబొడ్డున ఉన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో బెల్ట్ షాపు నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహించగా, ఆ వేలం పాటలో చివరకు ఓ వ్యక్తి రూ.3 లక్షల 57 వేలకి దక్కించుకున్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం. ఈ పరిణామంపై గ్రామస్తుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నప్పటికీ, బహిరంగంగా మాట్లాడేందుకు వారు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఎవరైనా ప్రశ్నిస్తే ఇబ్బందులకు గురవుతామన్న భయంతో మౌనం పాటిస్తున్నారని గ్రామ వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామంలో మద్యనిషేధాన్ని ప్రోత్సహించి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పాల్సిన ప్రజాప్రతినిధులు, బెల్ట్ షాపుల కోసం వేలం నిర్వహించడం ఏమిటని గ్రామస్థులతో పాటు పలు వర్గాలు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది.

# రోడ్డు భద్రతపై క్విజ్, వ్యాసరచన పోటీలు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మన్ ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా రెయిన్బో ఇంగ్లీష్ మీడియం పాఠశాల, శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్, కాకతీయ హై స్కూల్‌లలో 'రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు - వాహనదారులు తీసుకోవలసిన జాగ్రత్తలు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, మొత్తం 12 ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే 'రోడ్డు రవాణా ప్రమాదాలు' అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించగా, 10 పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు నిర్ణయించారు. ఈ కార్యక్రమాలకు జడ్జిలుగా రిటైర్డ్ అధ్యాపకులు మద్దికుంట లక్ష్మణ్, పిల్లి ధర్మయ్యతో పాటు అధ్యాపకులు సిహెచ్. వెంకటరమణ, బి. వేణుగోపాల్ రావు వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా జిల్లా రవాణా శాఖ సభ్యులు సంగీతం శ్రీనాథ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారులు, సహాయక మోటార్ వాహనాల తనిఖీ అధికారులు బేతి రజని, పృథ్వీరాజ్ వర్మతో పాటు రవాణా శాఖ సిబ్బంది కానిస్టేబుళ్లు సౌమ్య, రమ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 'భూ భారతి' దేశానికే ఆదర్శం

అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని మంత్రి తెలిపారు. రైతుల భూముల సమస్యలకు పారదర్శకంగా, వేగంగా పరిష్కారం అందించేలా ఈ పోర్టల్ ఉపయోగపడుతోందన్నారు. తెలంగాణ రైతుల భూములకు సంబంధించిన కీలకమైన సర్వే విభాగాన్ని బలోపేతం చేసేందుకు ఇప్పటికే 3,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామని, మరో వారం రోజుల్లో అదనంగా 3,000 మందిని తీసుకోనున్నామని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాల్లో కొంత ఆలస్యం రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల కారణంగా జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెస్సా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొని ప్రభుత్వ చర్యలను అభినందించారు.

# ఆర్థిక అక్షరాస్యత సదస్సు

- జనరల్ ఇన్సూరెన్స్ లబ్ధిదారుకు రూ.20 లక్షల చెక్కు అందజేత

**వేద న్యూస్, హుజూరాబాద్:**




హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మర్రిపల్లిగూడెం బ్రాంచ్ వారు నాబార్డ్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహనా సదస్సు మంగళవారం నిర్వహించారు. కళాజాతర కళాకారులు జానపద గీతాలతో, మ్యాజిక్ షోఅబశ్రీశ్రీలతో బ్యాంక్ సేవలను వివరించి ఆకట్టుకున్నారు. ఇటీవల మామిడాల ఇంద్రయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చనిపోయారు. ఆయన పేరు మీద తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ రూ.వెయ్యితో తీసుకోగా, ఆయన భార్య మంజులఅబశ్రీశ్రీకు రీజినల్ మేనేజర్ బాలనాగు ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్సు లబ్ధిదారు అయిన ఆమెకు రూ.20 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నాగేందర్, బ్యాంక్ సిబ్బంది, సర్పంచ్ కదురూ కవిత, తిరుపతి సీఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు

వేద న్యూస్

బుధవారం జనవరి 07, 2026

# ఓటరు జాబితాలో తప్పులు సవరించాలి

- దొంగ ఓట్లు, చనిపోయిన వారి పేర్లు తొలగించాలి
- లేకుంటే రిజర్వేషన్లపై ప్రభావం చూపే అవకాశం
- ఏఐఎఫ్‌బీ డిమాండ్ కరీంనగర్ జిల్లా నేతలు




**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు చొప్పదండి, జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపాలిటీల్లో ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలు తప్పుల తడకగా మారాయని వాటిని వెంటనే సవరించాలని ఏఐఎఫ్‌బీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కోమటి రెడ్డి తేజ్ దీప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక చోట్ల డబుల్ ఓట్లు నమోదవడం, దొంగ ఓట్లు చేర్చడం, చనిపోయిన వారి పేర్లు తొలగించకపోవడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఇలాంటి లోపాలు రిజర్వేషన్‌లపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఒక డివిజన్‌కు చెందిన ఓటర్లు మరో డివిజన్‌లో నమోదు కావడం, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు డివిజన్లలో కనిపించడం వంటి తప్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. వీటిని పీఎల్‌ఓల ద్వారా సరిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా బొమ్మకల్‌లోని మెడికల్ కాలేజ్, రేకుర్తి లయోలా స్కూల్, కొత్తపల్లి, తీగలగుట్టపల్లి, కరీంనగర్ రూరల్ ప్రాంతాలు, అలాగే ప్రైవేట్ హాస్టళ్లలో దొంగ ఓట్లు ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒకే ఇంటి నంబర్‌పై 10 నుంచి 30 మంది వరకు ఓటర్లు నమోదైన ఘటనలను గుర్తించి, వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. డివిజన్ల పునర్విభజన అనంతరం కొన్ని డివిజన్లలో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండగా, మరికొన్ని డివిజన్లలో తక్కువగా ఉండడం వల్ల ప్రజలు, ఓటర్లు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. అలాగే ఒక డివిజన్‌కు చెందిన ఓటర్లు సుదూర ప్రాంతాల్లో ఉన్న మరో డివిజన్‌లో నమోదు కావడం కూడా సమస్యగా మారిందని పేర్కొన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తి, మల్కాపూర్, చింతకుంట, కొత్తపల్లి డివిజన్లలో ఓటరు జాబితాలపై ప్రత్యేక దృష్టి సారించి లోపాలను సవరించాలని ఏఐఎఫ్‌బీ కరీంనగర్ జిల్లా కమిటీ తరపున విజ్ఞప్తి చేశారు.

# సీఐటీయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా రాజమల్లు

**వేద న్యూస్, కరీంనగర్:**

డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగిన సీఐటీయూ 18వ జాతీయ మహాసభల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన జనగాం రాజమల్లు జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నిక కావడంపై సీఐటీయూ కరీంనగర్ జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది. కరీంనగర్ జిల్లా కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ స్థాయిలో ప్రస్తావించే అవకాశం కల్పించినందుకు సీఐటీయూ జాతీయ కమిటీకి, రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి తెలిపారు. ప్రస్తుతం జనగాం రాజమల్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా, తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గత 25 సంవత్సరాలుగా సీఐటీయూ ఉద్యమాల్లో చురుకుగా పనిచేస్తూ, మున్సిపల్ కార్మికుల హక్కుల కోసం అంకితభావంతో పోరాటాలు సాగించారని జిల్లా కమిటీ పేర్కొంది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సామాన్య కార్యకర్తగా ఉద్యమ ప్రస్థానం ప్రారంభించిన రాజమల్లు, దశాబ్ద కాలం పాటు మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా, అలాగే కేవీపీఎస్ జిల్లా కార్యదర్శిగా, మున్సిపల్ యూనియన్ జిల్లా ఉమ్మడి సెక్రటరీగా వివిధ బాధ్యతలు నిర్వర్తించినట్టు తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ బాధ్యత ద్వారా రాబోయే రోజుల్లో కార్మిక సంఘాల ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు కోసం, మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కమిటీ ఆకాంక్ష వ్యక్తం చేసింది..



- కరీంనగర్ జిల్లా కమిటీ హర్షం

# 290 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- రైస్ మిల్లులో అర్ధరాత్రి పోలీసుల దాడులు



**వేద న్యూస్, హుజూరాబాద్:**

హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో ఉన్న లవకుశ రైస్ మిల్లులో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 290 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం అర్ధరాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులకు హుజూరాబాద్ సీఐ కరుణాకర్ నేతృత్వం వహించారు. లవకుశ రైస్ మిల్లులో రేషన్ బియ్యం అక్రమంగా లోడింగ్ చేస్తున్నారన్న సమాచారం అందడంతో, సీఐ కరుణాకర్ పోలీసు బృందంతో కలిసి మిల్లుపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకున్నట్లు గమనించిన మిల్లులో పనిచేస్తున్న కూలీలు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు బియ్యంతో నిండిన లారీని స్వాధీనం చేసుకుని హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై వెంటనే సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించారు. ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ అక్రమ వ్యవహారంలో పాల్గొన్న వ్యక్తులపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయం సమీపంలో కుక్కల దాడిలో గాయపడిన ఏడేళ్ల బాలుడి కుటుంబాన్ని కాలనీవాసులు మంగళవారం పరామర్శించి సానుభూతి తెలిపారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. ఆలయంలో పెంచుతున్న కుక్కలను వెంటనే అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న రాజేశ్వర్ అప్ప కుటుంబంపై ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీనికి స్పందించిన పూజారి భార్య కవిత, రెండు రోజుల్లో కుక్కలను దూర ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు.

# రోగులకు పురుగుల అన్నం!

- సిరిసిల్ల సర్కార్ ఆస్పత్రిలో ప్రాణాలతో చెలగాటం
- నిర్లక్ష్యంపై పేషెంట్స్, వారి బంధువుల ఆగ్రహం
- కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రోగులకు ప్రాణం పోయాల్సిన ఆసుపత్రిలోనే వారి ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న పరిస్థితి వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రిలో రోగులకు వడ్డించిన మధ్యాహ్న భోజనంలోని అన్నంలో తెల్లటి పురుగులు కనిపించడంతో రోగులు, వారి బంధువులు షాక్‌కు గురయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోగులకు పోషక విలువలతో కూడిన నాణ్యమైన భోజనం అందించాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వడ్డించిన అన్నంలో పురుగులు కనిపించడంతో రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నంలో పురుగులు ఉన్న దృశ్యాలను కొందరు రోగుల బంధువులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించగా, ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఈ ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రోగుల భోజనాల కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఆసుపత్రి సిబ్బంది, భోజన నిర్వాహకుల తీరుపై రోగుల బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగం తగ్గి ఇంటికి వెళ్దామనుకుంటే, ఇలాంటి భోజనం పెట్టి ఉన్న రోగాన్ని మరింత పెంచుతున్నారా? అంటూ వారు ప్రశ్నించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, బాధ్యులైన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, భోజన నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని రోగులు, వారి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

# నూతన పాలక వర్గానికి సన్మానం

- తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- సర్పంచ్ లావుడియా రమా రవీందర్

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలోని సూర్యనాయక్ తండా గ్రామంలో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని, పంచాయతీ కార్యదర్శిని తెలంగాణ స్టేట్ ట్రైబల్ లీడర్ మాలోతు లింగు నాయక్ ఘనంగా సత్కరించారు. గ్రామ అభివృద్ధికి నాయకత్వ బాధ్యతలు చేపట్టిన సర్పంచ్‌తో పాటు పాలక వర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాలోతు లింగు నాయక్ మాట్లాడుతూ.. ప్రజల ఆశలు–ఆకాంక్షలను ప్రతిబింబించేలా పాలక వర్గం పనిచేయాలని కోరారు. సర్పంచ్ లావుడియా రమా రవీందర్ నాయకత్వంలో సమిష్టి కృషితో తండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సూచించారు. సర్పంచ్ రమా రవీందర్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పారదర్శక పాలన అందిస్తామని, ప్రజల భాగస్వామ్యంతో అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- నెల రోజుల్లో ఇండ్లు ప్రారంభానికి సిద్ధం చేయాలి
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం హౌసింగ్ అధికారులు, ఎంపీడీఓలు, ఏఈలతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 7,408 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, ఇప్పటివరకు 5,571 ఇండ్లకు ముగ్గు వేసినట్లు తెలిపారు. 4,544 ఇండ్లు బేస్‌మెంట్ లెవెల్‌లో, 3,193 ఇండ్లు గోడల స్థాయిలో, 2,370 ఇండ్లు స్లాబ్ లెవెల్‌లో ఉన్నాయని వెల్లడించారు. ప్రతి ఎంపీడీఓ రోజూ కనీసం 10 ఇండ్ల పురోగతిని పరిశీలించాలని, లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. తాను ఏ మండలాన్నైనా ఆకస్మికంగా తనిఖీ చేస్తానని హెచ్చరించారు. లబ్ధిదారులకు ఇటుకలు, నిర్మాణ సామగ్రి సరసమైన ధరలకు అందేలా హౌసింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్మాణ అడ్వాన్స్ తీసుకుని పనులు చేయకుండా వెళ్లిపోయిన మేస్త్రీలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఉపాధి హామీ పనులను ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వినియోగించుకోవాలని ఆదేశించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల ఫోటోలను హౌసింగ్ ఏఈలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. బోయినపల్లి మండలంలో 23, తంగళ్ళపల్లి మండలంలో 14 ఇండ్లు పూర్తి చేసిన అధికారులను అభినందించారు. రానున్న నెల రోజుల్లో జిల్లాలో మొత్తం 280 ఇందిరమ్మ ఇండ్లు గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఏఈలు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు కేఎంసీ విద్యార్థి ఎంపిక

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ పోటీలకు నాగిరెడ్డి సాయి సుధాంశ్ రెడ్డి ఎంపికయ్యాడు. కరీంనగర్ కు చెందిన సాయి సుధాంశ్ వరంగల్లోని కాకతీయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. సాయి సుధాంశ్ చండీగఢ్ యూనివర్సిటీలో ఈ నెల 9 వరకు జరిగే ఇంటర్ వర్సిటీ రెజ్లింగ్ పోటీలో భాగంగా ఫ్రీ స్టైల్ 79 కేజీల విభాగంలో కాళోజి నారాయణరావు ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా సాయి సుధాంశ్ ను విశ్వవిద్యాల వైస్ ఛాన్స్ లర్ డ్యా..రమేష్ రెడ్డి,రిజిస్ట్రార్ డా_.నాగార్జున రెడ్డి,డ కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.సంధ్య, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ రామ్ కుమార్ రెడ్డి, పీడీలు సందీప్ జాదవ్, ప్రభాకర్ రెడ్డి, శ్యామ్ లు అభినందించారు.




# కన్నతల్లి లాంటి పార్టీపై ఆరోపణలు తగదు

- మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ గౌస్

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శాసనమండలిలో కల్వకుంట కవిత చేసిన వ్యాఖ్యలపై మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ గౌస్ తీవ్రంగా స్పందించారు. కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పై కవిత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ కవితకు ఒకసారి పార్లమెంట్ సభ్యత్వం, మరోసారి ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. అలాంటి పార్టీపై కృతజ్ఞతలు లేకుండా ఆరోపణలు చేయడం తగదని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు దయదాక్షిణ్యాలతో పదవులు అనుభవించి, ఢిల్లీలో రాజకీయ అవకాశాలను వినియోగించుకున్నారని అన్నారు. ఒక మహిళగా మద్యపాన నిషేధంపై పోరాడాల్సిన నైతిక బాధ్యతను విస్మరించి, లిక్కర్ స్కామ్ పేరుతో పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదని షేక్ గౌస్ ఆరోపించారు. తనకు రాజకీయ పునర్జన్మ ఇచ్చిన బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేయడం అనైతికమని పేర్కొన్నారు. దమ్ముంటే బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని కవితకు సవాల్ విసిరారు. ఇకపై పార్టీ నాయకత్వంపై, ముఖ్యంగా హరీష్ రావు, కేటీఆర్పై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

# రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి




**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ పోలీసు అధికారుల సమన్వయంతో పోచమ్మ మైదాన్ కూడలిలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు మరియు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యం.సాయికుమార్, సెంట్రల్ జోన్ డిసిపి.ధార కవిత, ఏఎస్పి శుభం, ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ, వరంగల్ భారత్ అసియేషన్ ప్రెసిడెంట్ వలస.సుధీర్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సుజాత, మట్వాడ ఇన్స్పెక్టర్ కరుణాకర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టీ.జయపాల్ రెడ్డి మరియు సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ మాట్లాడుతూ cరోడ్డు భద్రతపై అవగాహన అత్యంత ముఖ్యమైన అంశం అని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను నాశనం చేస్తున్న విషాద కథలుగా మారుతున్నాయని తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం ఇవన్నీ ట్రాఫిక్ ఉల్లంఘనలుగా తెలిపారు. ఒక్క క్షణపు నిర్లక్ష్యం ఒక ప్రాణాన్ని తీస్తుంది కావున వాహనదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు నియమాలు మీ ప్రాణాలను, మీ కుటుంబాల భవిష్యత్తును కాపాడేందుకు రూపొందించబడ్డాయి. ట్రాఫిక్ నియమాలు పాటించడం మనందరి బాధ్యత గా తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం మనందరి సామూహిక బాధ్యతగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి ధార.కవిత మాట్లాడుతూ cఅతివేగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం చిన్న తప్పులు కావు, ప్రాణాంతక తప్పులుగా సూచించారు. రోడ్డు నియమాలు తప్పకుండా పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారు ప్రచురించిన ట్రాఫిక్ నియమాల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం సుమారు 200 మంది విద్యార్థులచే ప్లకార్డులతో, నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, వాహనదారుల తో ట్రాఫిక్ నియమాలు పాటించేలా ప్రతిజ్ఞ చేపించారు. కూడలి వద్ద న్యాయమూర్తులు, పోలీసు అధికారులు హెల్మెట్ ధరించిన వాహనదారులకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

# సిరికొండ ఆత్మీయ పరామర్శ

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండల కేంద్రానికి చెందిన పలు కుటుంబాలను తెలంగాణ తొలి స్పీకర్, శాసనసభ ప్రతిపక్ష నేత సిరికొండ మధు సూదన చారి పరామర్శించారు. ప్రమా దాలు, అనారోగ్య కారణాలతో ఇబ్బందులు ఎదు ర్కొంటున్న కుటుంబాలకు ఆయన అండ గా నిలిచారు. ఈ సందర్భంగా శాయం పేట టౌన్ మాజీ అధ్యక్షుడు పొడి శెట్టి గణేష్ భార్య రోడ్డు ప్రమాదానికి గురికాగా, ఆమె యోగ క్షమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే శాయంపేట మండల కేంద్రానికి చెందిన మంత్రి రవీందర్, గోరంట్ల నరసయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందగా వారి కుటుంబాలను ఓదార్చారు. అదేవిధంగా సూరంపేట, గట్ల కానీపర్తి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను కూడా పరామర్శించి, కష్టసమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గుర్రం రవీందర్, రమేష్, ముంజల నాగరాజ్, కర్ణాకర్, తరుణ్ గోపి, మహేందర్ రెడ్డి, రంజిత్, సారయ్య, విజయ్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

# వెనిజులాపై అమెరికా దురాక్రమణను ఆపాలి

**వేద న్యూస్, టేక్మాల్ :**

వెనిజులాలోని వివిధ ప్రాంతాలపై అమెరికా చేపడుతున్న బాంబు దాడులు, సైనిక చర్యలు దురాక్రమణ చర్యలేనని సీఐటీయూ జిల్లా నాయకురాలు నర్సమ్మ అన్నారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అమెరికా దురాక్రమణ విధానాలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెనిజులాలో అధికార మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో మధురో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు అమెరికా గత కొన్ని వారాలుగా వెనుజులా చుట్టూ తన సైనిక, నావికా దళాలను సమీకరిస్తోందని ఆరోపించారు. డిసెంబర్ 2025 మొదటి వారంలో ప్రకటించిన అమెరికా జాతీయ భద్రతా వ్యూహం-2025 యొక్క నిజస్వరూపం ఇప్పుడు బయటపడిందని విమర్శించారు. అమెరికా వెంటనే తన దురాక్రమణ చర్యలను నిలిపివేసి, కరేబియన్ సముద్రం నుంచి అన్ని సైనిక దళాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోందని నర్సమ్మ తెలిపారు. లాటిన్ అమెరికాను శాంతి ప్రాంతంగా ప్రకటించాలని, సార్వభౌమ దేశాల అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యాన్ని ప్రపంచం అంగీకరించకూడదని అన్నారు. అమెరికా దురాక్రమణను ఖండిస్తూ యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్ తీర్మానం ఆమోదించాలని, వెనిజులాపై దాడులు ఆపేందుకు అమెరికాపై అంతర్జాతీయ ఒత్తిడి పెంచాలని సీఐటీయూ డిమాండ్ చేస్తోందన్నారు. అలాగే భారత ప్రభుత్వం కూడా ఈ దాడులను ఖండిస్తూ వెంటనే అధికారిక ప్రకటన చేయాలని సీఐటీయూ మెదక్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో కృష్ణ, నర్సింలు, శివయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



**- సీఐటీయూ నాయకురాలు నర్సమ్మ**

# ఆటో ట్రాలీ, బైక్ ఢీ..

**- యువకుడికి తీవ్ర గాయాలు**
**- కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామ శివారులో ఘటన**

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామ శివారు భీంపల్లి రోడ్డుపై ఆటో ట్రాలీ, బైక్ ఢీకొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికి చెందిన రేణికుంట్ల ఆకాశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం.. ఆకాశ్ తనుగుల గ్రామం నుంచి హనుమకొండకు బైక్‌పై వెళ్తున్న సమయంలో ఉప్పల్ గ్రామ శివారులో ఆటో ట్రాలీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో యువకుడి కుడికాలు నుజ్జునుజ్జయ్యడం తో పాటు శరీరంలోని పలుచోట్ల తీవ్ర గాయాలు కాగా, అధిక రక్తస్రావం జరిగింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే కమలాపూర్ 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటీ బండ ఉపేందర్, పైలట్ చెలిక తిరుపతి సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

# పాఠశాలలో ఘనంగా ముగ్గుల పోటీలు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ హైస్కూల్‌లో సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఆధ్వర్యంలో, అల్ఫోర్స్ ఆదినేత నరేందర్ రెడ్డి సహకారంతో ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని, తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా రంగురంగుల ముగ్గులను వేశారు. దాదాపు 50 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేయగా, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ సుజాతలను పలువురు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు అభినందనలు తెలియజేశారు. పాఠశాల బలోపేతానికి గ్రామ ప్రజలు సహకరించి విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం, సుంకపాక చక్రవర్తి, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సెంటర్‌లో అక్షరాభ్యాసం

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఫకీర్ కొండాపూర్ గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నపిల్లల విద్యకు మంచి ఆరంభం కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తోట రమేష్ మాట్లాడుతూ.. అన్నదానం ఆకలిని తీర్చితే, అక్షరాభ్యాసం అజ్ఞానపు చీకట్లను తొలగిస్తుంది అని పేర్కొన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు అంగన్వాడీ సెంటర్లలో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా వినియోగించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక, అంగన్వాడీ టీచర్లు రోదసి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

# యాజమాన్య పద్ధతులతో తెగుళ్లకు చెక్

**- హార్టికల్చర్ అధికారి నసీమా**

**వేద న్యూస్, దామరచర్ల:**



మిర్చి పంటలో ప్రధానంగా తామర పురుగు, రైజోక్టోనియా విల్ట్ తెగులు ఎక్కువగా ఆశిస్తాయని, రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఈ తెగుళ్లను సమర్థంగా నివారించవచ్చని మిర్యాలగూడ హార్టికల్చర్ అధికారి నసీమా అన్నారు. దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామంలోని మిర్చి పంటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. తామర పురుగులను తట్టుకునే అందుబాటులో ఉన్న రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. మిర్చి పంటను ఆగస్టు నెలలో నాటితే పూత దశలో తామర పురుగుల ప్రభావం తగ్గి పంటను రక్షించుకోవచ్చని తెలిపారు. అంతరకృషి చేయడం ద్వారా మట్టిలోని కోశస్థ దశలను నశింపజేయవచ్చని అన్నారు. మిర్చి పంటలో మొక్కజొన్న, జొన్న, బొబ్బెరను అంతరపంటలుగా 10:3:1 వరుసల నిష్పత్తిలో సాగు చేయాలని సూచించారు. విత్తనానికి కిలోకు 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ కలిపి విత్తన శుద్ధి చేయాలని తెలిపారు. మొక్కలను ప్రధాన పొలంలో నాటిన 15 రోజుల తర్వాత ఫిప్రోనిల్ 10 గ్రాముల గుళికలను నేలలో అందించాలని సూచించారు. తామర పురుగుల పర్యవేక్షణకు నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 40ఉ50 చొప్పున పంట ఎత్తులో ఏర్పాటు చేయాలని తెలిపారు. సాధ్యమైనంతవరకు రసాయన పురుగు మందుల వినియోగాన్ని తగ్గించి, మొక్కల ఆధారిత పురుగు మందులను వినియోగించాలని సూచించారు. ఎన్ఎస్‌కేఈ ఏ 5 శాతం లేదా వేప నూనె 3 మిల్లీలీటర్లు / లీటరు నీటికి లేదా కానుగ నూనె 3 మిల్లీలీటర్లు / లీటరు నీటికి కలిపి, మొక్క పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలని చెప్పారు. వావిలి సారం వంటి సహజ ద్రావణాలను కూడా వినియోగించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లేపల్లి గ్రామ సర్పంచ్ రజిత మల్లు నాయక్, మిర్చి రైతులు ధీరావత్ మాలు, సక్ర, ఏఈఓ ప్రియాంక, ఆయిల్ పామ్ ఫీల్డ్ అసిస్టెంట్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ప్రజ్ఞా పాటవ పోటీలు

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మండల స్థాయి పదవ తరగతి విద్యార్థుల ప్రజ్ఞా పాటవ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీల్లో జెడ్పిహెచ్ఎస్ గోదూరు ప్రథమ స్థానంలో నిలువగా, ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి మధు, కళాశాల ప్రిన్సిపల్ ఏ. సంజీవ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్ విద్యాధికారి బి. నారాయణ, మండల అభివృద్ధి పరిషత్ అధికారి సిహెచ్. గణేష్ హాజరయ్యారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని పోటీలను విజయవంతం చేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్‌తో పాటు మెమెంటోను కూడా ప్రదానం చేశారు.

# శ్రీ చైతన్య యూత్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి మండలం సాంబయ్యపల్లి గ్రామంలో శ్రీ చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా లింగంపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా లింగంపల్లి శ్రీనివాస్, క్యాషియర్‌గా మోదంపల్లి రాజేష్, కార్యదర్శిగా కట్టెకోల రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధి, యువత ఐక్యత కోసం కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073